# కృష్ణార్పణం

వరకట్నం దురాచారం నశించాలి"

"స్త్రీ పురుషులు సమానం"

కట్నం అడిగితేపెళ్ళే మా కొద్దు. వరకట్న పిశాచాన్ని రూపు మాపేవరకూ విశ్రమించం"

కాలేజీలో చదువుతూన్న అమ్మాయిలు కొందరు మీటింగ్ జరుపుతున్నారు. మెర్క్యురీ లైట్ల వెలుగులో షామియానాలో నుంచి యీ నినాదాలు మిన్నుముడుతూన్నాయి. శీతాకోకచిల్లావున్న అమ్మాయిలు హడావుడిగా తిరుగుతూ మీటింగ్‌కొచ్చిన వారిని కుర్చీల్లో కూర్చోపెడుతున్నారు. జనం కిటకిటలాడిపోతున్నారు.

ఆ అమ్మాయి చెప్పేదంతా ముగ్ధుడైవింటూ తలవూపుతూ అందరూ కరతాళ ధ్వనులు చేస్తూంటే తనూ మెల్లగా చేతులుతట్టుతూ కూర్చున్నారు సచ్చిదానందమూర్తిగారు. భార్గవి అనే అమ్మాయి మాట్లాడుతోంది. పురుషుల ఆధిక్యతని నిరసిస్తూ స్త్రీల నిస్సహాయ స్థితిని వివరిస్తూ "అందరూ సమానమే అయినప్పుడు అమ్మాయి కట్నం యెందు కివ్వాలి! అసలు యీ వరకట్న పిశాచాన్ని తరిమి కొట్టాలంటే కులాంతర వివాహాలు విరివిగా జరగాలి" అంటూ మాట్లాడింది.

వేదిక మీద వుపన్యసించి ఆఖరున ఆవేశంగా ప్రతిజ్ఞలు చేస్తూన్నారు. ఆ మీటింగ్‌కి అధ్యక్షత వహించిన సచ్చిదానందమూర్తిగారు దేశభక్తుడు, సంఘసేవే ఆయనకి వూపిరి. తల నెరసిన వృద్ధుడాయన. అమ్మాయిలు

వేసిన పూవుల దండల బరువుకి మెడ వంగిపోతూవుంది. ఆడవాళ్ళ హక్కుల రక్షణకి పోరాటం సాగించాలని యెలుగెత్తి అనర్గళంగా వుపన్యాసం యిస్తోంది ఆ సంఘం శెక్రటరీ కుముదినీదేవి. అన్నింట్లోకి ముఖ్యమైంది. వరకట్న దురాచారాన్ని రూపుమాపాలని మరీ మరీ బల్లగుద్ది చెప్తోంది ఆ అమ్మాయి.

యింతలో ఆ సభలో వున్న ఓ యువకుడు లేచి నిల్చుని సచ్చితానందమూర్తిగార్కి నమస్కారం చేసి-

'నాదో మనవి'అన్నాడు 'ఏమిటో' చెప్పుఅన్నట్లు చూశారుఆయన.

"చూడండి నేను హరిజనుడని. కట్నంపైన అక్కర్లేదు. ఆ అమ్మాయిని పెళ్ళాడటానికి నాకేం అభ్యంతరంలేదు. జవాబు చెప్పమనండి" అని సవాల్ చేశాడు.

సచ్చితానందమూర్తిగారు ఆ అమ్మాయి వైపు చూశారు. అప్పటికే ఆ అమ్మాయి ముఖం నల్లగా మాడిపోయింది. సెక్రటరీ కుముదినితో రహస్యంగా యేదో చెప్పి అక్కడ నుంచి అవతలకి వెళ్ళిపోయింది. సభ అంతా నిశ్శబ్దంగా అయిపోయింది. కుముదిని లేచింది.

"చూడండి పెళ్ళిళ్ళు అంటే యిలాంటి మీటింగ్‌లలో తేల్చుకునే విషయాలు కావు కదూ,"

యింతలో మరో యువకుడు లేచాడు

"అయితే యీ వరకట్నం దురాచారం యిలాంటి మీటింగ్‌లో పరిష్కరించేయగలరా" యింతలో మరో యిద్దరు కుర్రాళ్ళు లేచారు.

నల్లగా వున్నా పొడుగ్గా వున్నాడు. ముఖంలో కళవుంది. ఖరీదైన దుస్తులు కాకున్నా పరిశుభ్రమైన సాదా బట్టల్లో వున్నాడు.

"చూడండి నేను పట్టభద్రుడనే కానీ నిరుద్యోగిని. వుద్యోగస్తురాలైన యస్సెల్సీ అయిన అమ్మాయినైనా సరే పెళ్ళాడటానికి రెడీగావున్నాను. నాకు కులాల పట్టింపులేదు. పైన కట్నం అక్కర్లేదు. నా క్కావల్సింది నన్ను ప్రస్తుతం పోషించగల్గిన భార్య, యేం? యే అమ్మాయి అయినా ముందుకు వస్తుందా?"

సభలో గుసగుసలు ప్రారంభ మయాయి.

అబ్బాయి ఫర్లేదు, కానీ తర్వాతన్నా వుద్యోగం దొరుకుతుందన్న గ్యారంటీ యేమిటి ? అతని వెనక బాధ్యత యెంతవుందో ! అవన్నీ యెవరు భరిస్తారు.

అతను రెండు నిమిషాలు నిల్చుని కూర్చుంటూ చిరునవ్వు నవ్వాడు.

మరో కుర్రాడు లేచి యేదో చెప్పబోతుంటే అతని స్నేహితులు షర్టుపట్టుకుని గుంజి కూర్చోబెడుతున్నారు. వేదికమీదున్న కుముదినికి చెమటలు పట్టేస్తున్నాయి. తమ ఆశయాలు బహిర్గతం చేసేందుకు ఈ సభ యేర్పాటుచేసింది అమ్మాయిల అభిప్రాయాలు యెలుగెత్తిచాటారు. అంత వరకు బాగానేవుంది. కానీ మీటింగ్‌కి వచ్చిన యువకులు యిలా లేచి సవాల్ చేస్తారని అనుకోలేదు. అసలు తల్లిదండ్రుల చాటున పెరిగే ఆడపిల్లలు యేదో ఇక్కడ ఉపన్యాసం ఇవ్వగలరు గానీ యువకుల్లాగా "మేం పెళ్ళికి రెడీ" అంటూ ముందుకు రాగలరా ! అదీకాక ఇప్పుడు కట్నం అక్కర్లేదు అని ముందుకొచ్చిన అబ్బాయిల పరిస్థితి యేమంత బాగుంది కనుక, ఆడ పిల్లలు వరించి ఓ దండ వేయటానికి ?

ఇలా తీవ్రంగా ఆలోచిస్తూనే ప్రెసిడెంటు వైపు చూసింది. ఆ అమ్మాయికి అప్పటికే స్పృహ తప్పేంత స్థితి వచ్చేసింది. ఇది వట్టి చూపుల గొడ్డు. దేనికీ పనికిరాదు. పట్టుచీరె కట్టుకొని కుర్చీ నిండుగా కూర్చోటానికి తప్ప, అని విసుకుంటూ తనే యేదో ఉపాయం ఆలోచించాలని మెల్లగా లేచి "ఇప్పుడు శ్రీ సచ్చితానందమూర్తిగారు మాట్లాడుతారు" అనేసింది. సభలో మరో ఇద్దరుకుర్రాళ్ళు లేవబోయి మళ్ళీ కూర్చోవటం చూసిన కుముదిని కర్చిఫ్‌తో ముఖాన పట్టిన చెమట తుడుచుకొంటూ 'అమ్మయ్య' అనుకుంది కానీ, సచ్చితానందమూర్తిగార్ని మాట్లాడనీయకుండా ఓ కుర్రాడు అడ్డు తగులుతూ తన వివరాలు చెప్తూ నాకూ కట్నం అక్కరలేదు అంటూంటే కుముదినికి కోపం వచ్చి "మీ యువకులిలా ముందుకు రావటం సంతోషించ దగ్గ విషయమే. కాని ఇది ప్రత్యేకంగా స్త్రీలకోసం ఏర్పాటుచేసిన మీటింగ్ కనుక దయచేసి కూర్చోండి" అనటంలో అబ్బాయిలు పెద్దగా గోలచేసారు.

"సచ్చితానందమూర్తిగారూ వేదిక దిగేసేయండి. మన పురుషజాతికే అవమానం కల్గేలా చేస్తూన్నారీ అమ్మాయిలు" అంటూ.

ఇప్పటికి కానీ తను చేసినతప్పు అర్థంకాలేదు కుముదినికి.

'అరెరే' నాలిక కొరుక్కుంది. సచ్చితానందమూర్తిగారు మాత్రం కళ్ళతోనే కుముదినికి ధైర్యం చెపుతూ.

మీకేం తెల్సు పిల్లకాయలు. ఇలాంటి మీటింగ్‌లకి వెళ్ళినప్పుడు ఎన్నోరకాల పరిస్థితులు తటస్థింస్తూంటాయి. వాటిని చాకచక్యంగా పరిష్కరించేస్తూంటాం మేం. మీకులా యింత ఖంగారుపడితే యెలా! అన్నట్టుగా నవ్వి ఆయన ఉపన్యాసం ప్రారంభించారు.

ఈ మీటింగ్‌కి ముఖ్య అతిధిగా తనని పిల్చినందుకు ఆ సంఘానికి ప్రెసిడెంటుకీ కృతజ్ఞతలు తెల్పి "ముఖ్యంగా వరకట్న దురాచారంవల్ల ఎన్ని కుటుంబాల్లోని ఆడపిల్లలు వివాహాలు కాకుండా ఉండిపోతున్నారో ఒకవేళ అప్పులుచేసి పెళ్ళిళ్ళుచేసి తల్లిదండ్రుల స్థితి యెంత దయనీయంగా మారిపోతోందో వర్ణించిచెప్పి "యీ దురాచారం నసించాలంటే యువకులు ఆదర్శప్రాయుల్లా ముందుకు రావాలి. ఇక్కడ కొందరబ్బాయిలు వాళ్ళ సంసిద్ధతని వ్యక్తపర్చటం నాకెంతో సంతోషాన్ని కల్గించింది. అయితే యీ అబ్బాయిలు మాలాంటి వాళ్ళని యింటి దగ్గర కల్సుకుంటే అనుకూలంగావుంటుంది." అంటూదీర్ఘోపన్యాసం యిచ్చి "యింకవుంటాను" అంటూ ముగించారు.

కారు దగ్గరకి నడుస్తూన్న సచ్చితానందమూర్తిగారి వెంటనడుస్తూ కుముదిని ఆయన వచ్చినందుకు మరీ మరీ కృతజ్ఞత చెప్పి ఆయనకి వేసిన పూలదండలన్నీ కారులో పెట్టించింది. సచ్చితానందమూర్తిగారు అమ్మాయిలందరికీ నమస్కారం చేసి కారు యెక్కేశారు. కారు కదిలింది.

## 2

మరో రెండురోజుల్లోనే యీ మీటింగ్ వివరాలు పేపరులో పెద్ద అక్షరాల్లో అచ్చు అయ్యాయి, సచ్చితానందమూర్తిగారి భార్య మంగతా

యారు. కళ్ళజోడు పెట్టుకుని దినపత్రిక చదువుతూ కూర్చుంది సోఫాలో ఒక్కో వాక్యమూ కూడబల్కుంటూ భర్త వుపన్యాస సారాంశాన్ని శ్రద్ధగా చదువు తుంది. సచ్చిదానందమూర్తి వుదయం పూజపూర్తి కాకుండా వచ్చి మంచి నీళ్ళు ముట్టరు. ఆయన కుడిభుజం అయిన కనకారావు అప్పుడేవచ్చి అర్థగంట అయి "అర్జెంటు పని వుంది అయ్యగారి పూజ యింకా కాలేదూ" అని అడిగాడు.

మూర్తిగారు పూజ అయి గబగబా ఖాదీ బట్టలు వేసుకుని వంటామె అందించిన ఫలహారంచేస్తూ "తాయారూ నా ఉపన్యాసం పడిందా ఇవా ళన్నా" అన్నారు ఇడ్లీముక్కలుగా తుంచి సాంబారులో ముంచుతూ.

"చెప్పేవాళ్ళు లేక చెడిపోయారుగానీ ఆడవాళ్ళమీటింగ్‌లో మీ ఉప న్యాసం ఏమిటండీ" కోపంగా అంది ఆవిడ.

"నీ ముఖంలే. అసలు ఆడవాళ్ళ మీటింగ్‌లో మాట్లాడి సెభాష్ అన్పించుకోవటంలోనే వుంది గొప్ప. అందులో కాలేజీ స్టూడెంట్స్ అయిన చాకుల్లాంటి అందమైన అమ్మాయిల మీటింగు అది."

"మండినట్లుంది"

"నీ అసూయ మండిపోనూ! నా మాటవిను. ఆ సెక్రటరీ కుముదిని అనే అమ్మాయి వుంది చూశావూ అబ్బ! బలే హుషారైన పిల్ల. అసలు వాళ్ళొచ్చి పిలుస్తారని తెల్సిన మీ కనకారావు ముందే చెప్పాడు. ఆ ఆడపిల్ల లేవో తెల్సీ తెలియకా మీటింగుల్లో వాగేస్తూంటారు. ఆ మీటింగ్‌కి వెళ్ళటం ఎందుకూ? అదీకాక వరకట్నం నిషేధం గురించిన మీటింగట గనుక రానని చెప్పేయండి అని అర్థగంట చెవిని పని కట్టుకుపోరాడు. నాకు మరో పని చెప్తారను కున్నాను. కాని తీరా...ఆ కుముదిని వచ్చి "

"పిల్చేసరికి అయిస్ అయారు" ఛర్‌మంది మంగతాయారు.

"ఆ కుముదిని బతకలేని బడిపంతులు కూతురై పోయింది. కానీ డబ్బున్నవాళ్ళ పిల్ల అయి రాజకీయాల్లో దించేస్తే ఒక నాడు మన దేశానికి ప్రధాని కాగల్గిన తెలివివుంది. అసలామీటింగ్‌లో అమ్మాయిలు నా మతి

పోగొట్టేశారు. ఎందుకెళ్ళానో యేం మాట్లాడాలనుకున్నానో మర్చి పోయాను."

"చాల్చాలు" చెత్వారం జోడు తీస్తూ అంది.

"అసూయపడకే."

"సరే, అవన్నీ అటుంచండిగానీ నే నెన్నోసార్లు చెప్పాను, చేయ గలిగినది చెప్పాలనీ చెప్పింది అక్షరాలా చేసి చూపాలనీ. మీరో పెళ్ళి కావల్సిన అందమైన చదువుకున్న పదివందల జీతం తెచ్చుకుంటూన్న అబ్బాయికి తండ్రినని మర్చిపోయి మీరేదో అక్కడ వాగేస్తే యెలా!" నిలదీసింది.

"నీ ముఖం. ప్రజా నాయకులంటే అర్థం వేదికలమీద ఉపన్యాసం ఇవ్వటంవరకే."

"సరే అవన్నీ నా కెందుగ్గాని అనంతయ్య అయిదోసారి వచ్చి వెళ్ళాడు."

"కట్నం ఎంతిస్తాడట."

"లక్ష"

"నీకు లాంఛనాలూ !

"ముఖాల కడిగింపులో కంచి పట్టుచీరె, బంగారు తాటాకుల వెండి బొట్టు పెట్టా, స్టీలు పానకంబిందెలూ, ఫలహారంపళ్ళాలూ, అన్నట్టు బొట్టు పెట్టిలో వెండి కుంకుమభరిణా, బంగారం కాటిక్కాయా."

"యింకా"

"అబ్బాయికి అలక పాన్పుమీద అంబాసిడర్‌కారూ...ఫారెన్ వాచీ సూట్లూ...."

"ఇంకా...."

"ఆ పైన మీరడగ వల్సిందే. ఇంక నావల్లకాదు. అత్త రాక్షసి అంటారు"

"ఇంతకీ అమ్మాయి ఎలా ఉంటుందిట"

"నల్లగా ఉన్నా ఫర్లేదు. మెల్లకన్ను వున్నా కళ్ళజోడుంటుందిగా. పొట్టిగా కన్పిస్తూంది కానీ హైహీల్స్ వేయించవచ్చు. అయినా ఆడదానికి

అందం పుట్టుకతో అక్కరలేదు. అలంకరణతో, పట్టుచీరలతో, బంగారంతో వస్తుంది.

'భేష్'! అయితే అనంతయ్యని మరోపదిసార్లు తిప్పి యాభై వేలన్నా బేరం పెంచి సెటిల్ చేసుకుందాంలే" అంటూ వెళ్ళి పోయారాయన.

"ఏమేవ్! ఒసేవ్! యిలారా" సచ్చితానందమూర్తి భార్యను పిలిచారు.

"ఏమిటి కొంప మునిగినట్లు" సణుగుతూ వచ్చింది తాయారు.

"చూడూ! నీ దెప్పుడూ నిద్రముఖమేగానీ అనంతయ్య కూతుర్ని చూసుకుందువుగాని వెంటనే బయలుదేరిరా అని మనం టెలిగ్రాం ఇచ్చామా! అది అందకుండానే "నేను వస్తూన్నానని' అబ్బాయి ఉత్తరం రాశా డేమిటి?''

"పిచ్చి సన్నాసికి అమ్మను చూడాలన్పించి ఉంటుంది" నవ్వు కుంటూ అంది.

''పూ. సరే. చూట్టం పేరంటం రెండూ కలిసివస్తాయిలే. అయితే అనంతయ్యకు కబురు పెడతాను. పిల్లను చూసుకుందుకు వస్తాం" అని.

"శుభశ్య శీఘ్రం! అలాగే చేయండి. అన్నట్లు కుముదిని మళ్ళీ వచ్చింది ఎందుకూ?"

''ఆ పిల్ల అదృష్టవంతురాలే. ఆ మీటింగులో నే మాట్లాడానా! ఆ ఉపన్యాసానికి ప్రభావితుడయిన ఒక యువకుడు పైస కట్నంలేకుండా పెళ్ళికి వప్పుకున్నాడట. అన్నట్లు ఇవాళ సాయంత్రమే పెళ్ళి. తప్ప కుండా వెళ్ళాలి. ఏ స్నేహితుడి కారులోనన్నా వెడతాగానీ మన కారు అబ్బాయికోసం పంపు."

''అవన్నీ సరేగానీ మీ చచ్చు ఉపన్యాసానికి పైస కట్నం లేకుండా పదివందలు తెచ్చుకునేవాడు ఈ పిల్లని పెళ్ళాడటానికి ముందుకొచ్చిన ఆ చవట వెధవ ఎవరూ అంట."

"నాకేం తెల్సు, శుభ లేఖలు అచ్చుఅవటం ఆలశ్యం అయింది. అయినా మాపెళ్ళిదాల సింపులుగాజరుగుతుంది. ఉంగరాలు మార్చుకోవటం దండలు వేసుకోవటం అని చెప్పిందా అమ్మాయి."

"బావుంది. సిగ్గులేకుండా ఆ పిల్లే ఇదంతా చెప్పిందీ! అయ్యో! నారాతా!" మంగతాయారు బుగ్గలు నొక్కుకుంది.

నా కొడుకు పెళ్ళికి ఆకాశమంత పందిరీ భూదేవంత అరుగూ వేసి శీతారాముల కళ్యాణంలా చేయాలి. అనుకొంటూ నానాకలలుకంటూ ఉంది మంగతాయారు.

పెళ్ళికి యెంత త్వరగా వెళ్ళాలని బయలుదేరినా సచ్చితానందమూర్తి గార్కి దారిమధ్యలో ఆలశ్యమే అయింది. కనకారావుకూడా యీ పెళ్ళి చూడాలని వెంటవచ్చాడు. కళ్యాణమంటపం (పెళ్ళిజరిగే చోటుపేరులో) దాదాపు యాభై మందిదాకా స్త్రీలూ పురుషులూ రంగురంగుల దుస్తుల్లో కబుర్లు చెప్పుకుంటున్నారు. వివాహం అయినట్లుంది, కుముదిని నీలం జరీ పువ్వుల బెనారస్ పట్టుచీర కట్టుకొని అదేరంగు జాకెట్టు వేసుకొని మెడలో పెద్ద రోజాపూవుల దండతో ఆమెని పలకరిస్తూన్న స్నేహితులకీ చుట్టాలకీ చిరునవ్వుతో నమస్కరిస్తోంది. ఆ అమ్మాయి ప్రక్కనున్న యువకుడు ఫుల్ సూటులో వున్నాడు మెడలో రోజాదండ, కళ్ళకి నల్లకళ్ళద్దాలు.

లోపలికి వస్తూ దూరంనుంచి యీ నూతన దంపతులని చూస్తూన్న మూర్తిగారు అబ్బాయి పైసకట్టుం అక్కర్లేదంటే, మారని రూపాయేమో అనుకున్నాగానీ ఫర్లేదులావుందే. అయినాపెళ్ళిలో ముఖం స్పష్టంగాకన్పించ కుండా ఆ కళ్ళ జోడేమిటీ వెధవ ఫాషనూ వీడూనూ. అనుకుంటూనే అంతలోనే కుముదిని సంతోషంగా ముఖంపెట్టి నమస్కారం చేస్తూంటే పొంగిపోతూ,

"కంగ్రాట్యూలేషన్స్ కుముదినీదేవి! యీనాడుమనసమాజానికినీలాంటి ధైర్యవంతురాలైన ఆడపిల్లలు చాలామంది కావాలి." అంటూ యింకావేదో అలవాటుగా అనబోతూ తనకి నమస్కరిస్తూన్న పెళ్ళికొడుకుని తేరిపార జూస్తూ చెయ్యిఅందించబోయి నువ్వు...నువ్వు'అంటూ ఓ అడుగువెనక్కి

వేళాడాయన. యీయన రాగానే అక్కడ చేరిన అందరూ గుమిగూడారు. యేదేదో అనుకోవటం విన్పిస్తోంది. కానీ కళ్ళు బైర్లు కమ్మినట్లు అయి అంతలోనే కళ్ళు గట్టిగా తుడుచుకుని చూశారాయన.

శ్రీనివాస్ కళ్ళజోడు తీసేస్తూ "డాడీ యింత ఆలస్యం చేశారేం, అమ్మ ఏది?" అంటున్న తన ఏకైక పుత్రుడిని చూస్తూ "నువ్వు నిజంగా మా శ్రీనివాస్‌వే?" తడారిపోతూన్న గొంతుని పెగుల్చుకొంటూ అడిగారు. శ్రీనివాస్ నవ్వుతూ "డాడీ.. నేను.... నేనే ఇవాళ వస్తున్నానని ఉత్తరం రాశానుగా! వచ్చేసాను."

సచ్చితానందమూర్తిగారు తల తిరిగినట్లు అయి తూలిపడబోతూంటే దగ్గరున్న వాళ్ళు పట్టుకుని అయ్యో! యేమైంది" అంటూ ఆదుర్దా పడ్డారు.

"ఏం ...కాలేదు.... ఏం కాలేదు... యింటికి వెళ్ళాలి,"

"డాడీ! డాక్టరికి ఫోను చెయ్యనా" శ్రీనివాస్ ఖంగారుగా అడిగాడు

'వద్దు ...... వద్దు'

"క్రొత్తకోడల్ని యింటికి తీసుకెళ్ళాలని తడబడుతున్నారులావుంది. పదండి కుముదినీ శ్రీనివాస్" అంటూ స్నేహితులు కొందరు వాళ్ళిద్దరిని పూవుల దండలతో అలంకరించిన కారు యెక్కించి అది బయలుదేరుతుంటే సెక్రటరీ కుముదినీ దేవికీ జై' అంటూ గొంతెత్తి అరచారు. కొందరు సత్యమూర్తిగారి. వుదార హృదయాన్ని పొగిడారు.

అంత డబ్బున్న యీయన కొడుకు పెళ్ళి యింత నిరాడంబరంగా చేయటం నిజంగా గొప్ప విషయం. అంటూ యింకా యింకా, యివన్నీ వినేశక్తిలేక సత్యమూర్తి, కనకారావు ఆసరాతో కారు దగ్గరికి నడిచారు. కారు యెక్కి సీటు వెనక్కి జారగిలబడి గుండె నొక్కిపట్టుకుని బాధను మింగుతూ.

"కనకారావు! యిదంతా యెలా జరిగింది అంటావ్," అన్నాడు,

"యెలా యేమిటి నాముఖం మన అబ్బాయియిప్పుడు బెంగుళూరులో వుద్యోగంలో చేరినా అంత క్రితం యీవూరి రోడ్లలన్ని సర్వే చేసేవాడేగా.

అప్పుడు యీకుముదినితో పరిచయం అయివుంటుందని. ప్రేమప్రారంభమై వుంటుందని వేరే చెప్పక్కర్లేదుగా. బడిపంతులు కూతుర్ని మీ యింటికి కోడలుగా అంగీకరించరని అబ్బాయికి బాగాతెల్సు. అతను వెనక్కి తగ్గినా యీకాలం అమ్మాయిలున్నారు చూశారూ వీళ్ళు అసాధ్యులై పోతున్నారు. పెద్ద ప్లానే వేసేశారు. వరకట్నం నిషేధ సంఘం అన్నారు. మీలాంటి పెద్దల ఆశీస్సులు కావాలన్నారు,యింకేం అది. వాళ్ళు అన్న మాటలన్నింటికీ తల యెగరేశారు మీరు. కానీ మీముందరి కాళ్ళకి బంధం అని తెలుసుకున్నారా."

"లేదు? వెళ్ళికి రమ్మని పిలిస్తే అక్షంతలేగా వేశేద్దాం అనుకున్నాను కానీ నా కొంపే ముంచుతుంది కుముదినీదేవి అని కలలోనన్నా అనుకున్నానా!"

"కుముదినీదేవికి జై అనాలనిపిస్తుంది నాకు. అనబోయి మూర్తిగారి ముఖంచూస్తూ ఆగిపోయాడు.

"కనకారావ్! అనంతరామయ్య యిస్తానన్న లక్షన్నరా యెలాగయ్యా వదులుకునేది! అయ్యో గుండెనొప్పి....... ఎక్కువైంది"

"ల....ల...క్ష...న్నర....... నోట్లో మన్ను...ల...క్ష...న్న...ర .... కృష్ణార్పణం కావల్సిందేనా!"

"త్వరగా పోదాం" యింటికి

"వద్దు ... యీ వార్తవిన్న మా ... యింటిదానికి గుండె ... టక్కున ఆగిపోయివుంటుంది. డాక్టర్‌ని ...తీసుకు... మరీ వెపదాం... కనకారావ్? లక్ష ... న్నర... కృష్ణార్పణం.... అని ఆయన యింకా గొణుగుతూనేవున్నారు. కానీ కారు డాక్టర్ యింటివైపు స్పీడుగా వెళ్ళిపోతోంది.

"లక్ష... న్నర .... రూ... పాయలు మాయింటిదానికి లాంఛనాలు ... అయ్యో....

ఆయన మతిపోయినవాడిలా గొణుక్కుంటూన్నాడు. లక్షన్నరా కృష్ణార్పణంయేనా! అంటూ.